క్లుప్తంగా

కలెక్టర్‌తో చుడా చైర్మన్ భేటీ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చుడా చైర్మన్ కఠారి హేమలత

చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చుడా) చైర్మన్ కఠారి హేమలత కలెక్టర్‌తో భేటీ అయ్యారు. చుడా చైర్మన్‌గా నూతనంగా నియమితులైన ఆమె శనివారం మొదటిసారిగా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం చుడా పరిధిలోని పలు అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు.

సమన్వయంతో అభివృద్ధి ప్రణాళిక



శిక్షణా తరగతులకు హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

ఐరాల: అందరి సమన్వయంతో పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేయాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ జుబేదా తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనలక్ష్మి, విస్తరణాధికారి కుసుమకుమారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న దాత

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని లెప్రసీ వ్యాధి నివారణ కేంద్రంలోని బాధితులకు శనివారం దాత పార్థసారథి నాయుడు దుప్పట్లు పంపిణీ చేశారు. తొలుత కేంద్రంలో ప్రార్థనలు చేసి బాధితులకు దుప్పట్లు ఇచ్చారు. అలాగే నగరంలోని పలుచోట్ల ఉన్న యాచకులు, వ్యాధి గ్రస్తులకు, వృద్ధులకు 120 పైగా దుప్పట్లు అందజేశారు.

ఉద్యమకారుల సేవలు వెలకట్టలేనివి



గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులు అర్పిస్తున్న అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: గ్రంథాలయాల వృద్ధి కోసం అప్పట్లో ఉద్యమకారుల చేసిన సేవలు వెలకట్ట లేనివని కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారాల ట్రస్ట్ అధ్యక్షురాలు డాక్టర్ రామలక్ష్మి తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా గ్రంథాలయంలో ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణయ్య, రంగనాథన్, నాగభూషణం చిత్రపటాలకు నివాళులు అర్పించారు. వారి స్ఫూర్తితో విద్యార్థులు పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శర్మ, ఉపగ్రంథాలయాధికారి లలిత తదితరులు పాల్గొన్నారు.

26న ఐఎఫ్‌టీయూ ధర్నా

చిత్తూరు కార్పొరేషన్: రైతు, కార్మికుల సమస్యల కోసం ఈనెల 26న నిర్వహించనున్న ధర్నా జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సురేంద్రనాథ్ పిలుపునిచ్చారు. చిత్తూరులో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా ఒప్పంద ఉద్యోగులకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జ్యోతి, ఉమాపతి, శకుంతల, సరోజ మణెమ్మ, మంజుల సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

చిత్తూరు కార్పొరేషన్: బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు చిట్టిబాబు తెలిపారు. శనివారం నిర్వహించిన సంతపేట మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. పార్టీలో సభ్యులను చేర్పించాలని సూచించారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామభద్ర నాయకులు బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊరంతా.. వానర సైన్యం

పల్లెల్లో వానరాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఇళ్లలోకి, దుకాణాల్లోకి దూరి తీరని నష్టం వాటిల్లేలా చేస్తున్నాయి. గతంలో గ్రామాల్లో ఇళ్ల వద్దే పెరటి తోటలు, పూలమొక్కలు పెంచుకునే వారు. ఇంటికి అవసరమైన కూరగాయలు, ఆకుకూరలతో పాటు పూజకు కావాల్సిన పువ్వులు పండించుకునేవారు. వానరాల దెబ్బకు పూల మొక్కలు, పెరటితోటలు పెట్టాలంటే ఇప్పుడు భయపడుతున్నారు. మరోవైపు వీధికుక్కలు ఎప్పుడు ఎవరిని కరుస్తాయోనని జనం బెంబేలెత్తిపోతున్నారు.

- పల్లెల్లో శ్రుతిమించిన గ్రామసింహాల దాడులు
- వాహనదారులను వెంబడిస్తూ దాడి చేస్తున్న వైనం
- వానరాల ధాటికి ఆరుబయట రావాలంటే భయపడుతున్న మహిళలు
- మనుషులతో పాటు పాడి పశువులపైనా విరుచుకుపడుతున్న కుక్కలు
- నియంత్రించాలని కోరుతున్న పల్లె జనం



వీఎస్ అగ్రహారంలో ఓ ఇంటిపై వానరాల గుంపు, (ఇన్‌సెట్) మండలకేంద్రంలోని వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

ఐరాల: మండలవ్యాప్తంగా గ్రామాల్లో వానరాలు ఇళ్లలోకి చొరబడి వీరంగం సృష్టిస్తున్నాయి. గుంపులుగా సంచరిస్తూ హల్‌చల్ చేస్తున్నాయి. వీటి కారణంగా పిల్లలు, పెద్దలు బయటకు రావాలంటే జంకుతున్నారు. కోతులు గుంపులుగా తిరుగుతూ విద్యుత్ వైర్లపై నడుస్తూ సర్వీసు వైర్లు, డిష్ వైర్లను తెంచుతూ ప్రజల జేబులకు చిల్లు పెడుతున్నాయి. అలాగే వ్యవసాయం గిట్టుబాటు కాక అవస్థలు పడుతున్న రైతులకు మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా కోతుల బెడద తయారైంది. వ్యవసాయ, ఉద్యాన పంటలను కాపాడుకోలేని పరిస్థితి దాపురించింది. కోతుల బారి నుంచి రక్షించాలంటూ మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

గ్రామ సింహాల స్వైర విహారం..

వీధి కుక్కలు గ్రామాల్లో స్వైర విహారం చేస్తుండడంతో జనం బెంబేలెత్తుతున్నారు. మండలంలో 28 పంచాయతీలు ఉన్నాయి. ఏ వీధిలో చూసినా కుక్కలు పదుల సంఖ్యలో సంచరిస్తూ ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. జూలైలో యదర్లపల్లెకు చెందిన ఒకటో తరగతి విద్యార్థి లోహిత్ ఇంటి దగ్గర ఆడుకుంటూ ఉండగా వీధి కుక్క దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే నాగంవాండ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో వీధి కుక్క చొరబడి ఇద్దరు విద్యార్థులను గాయపరిచింది. ప్రతిరోజూ మండలంలోని ఏదో ఒక గ్రామంలో ప్రజలు, చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేస్తున్నాయి.

150 కుక్క కాటు కేసులు..

మండలంలోని చిన్నవెంకటంపల్లెకు చెందిన రైతు దినేష్ పాడి ఆవుపై గత ఏప్రిల్‌లో రెండు కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. మనుషులపైనే కాకుండా ఇలా జంతువులపై కూడా దాడి చేసి గాయపరుస్తున్న సంఘటనలు తరచూ జరుగుతున్నాయి. అధికారిక రికార్డుల ప్రకారం ప్రతి నెలా సగటున 25 నుంచి 30 మంది కుక్కకాటుకు గురై ఆస్పత్రి పాలవుతున్నారంటే కుక్కల బెడద ఏ మేరకు ఉందో తెలుస్తోంది. ఐదు నెలల వ్యవధిలోనే దాదాపు 150 కుక్క కాటు కేసులు ఆస్పత్రిలో నమోదయ్యాయి.

ఎటు చూసినా కుక్కలే..

మండల కేంద్రంలోని ప్రధాన రోడ్లతో పాటు ఏ వీధిలో చూసినా పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయి. వీటిలో అనేక కుక్కలు దారిన వెళ్లే వారిని కరిచేందుకు ప్రయత్నిస్తున్నాయి. ద్విచక్ర వాహనాలను వెంబడిస్తుండడంతో వాహనదారులు కింద పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలకేంద్రంలోని బజారు వీధి, వారపు సంత, జెండామాను వీధి, చికెన్ షాపులు, వీఎస్ అగ్రహారం, శివారు ప్రాంతాల్లో అత్యధికంగా తిష్టవేస్తున్నాయి. కుక్కల బెడద రాత్రిళ్లు మరింత అధికంగా ఉంటుందని బాధితులు లబోదిబోమంటున్నారు. రాత్రి సమయంలో బైక్‌లు, కార్లను కుక్కలు వెంబడిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని వాపోతున్నారు.

కుక్కలను నియంత్రించాలి..



మండల కేంద్రంలో కుక్కల బెడద రోజురోజుకు అధికమవుతోంది. చిన్న పిల్లలను, పెద్దవాళ్లను సైతం దాడి చేసి గాయపరుస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ భయాందోళనకు గురి చేస్తున్నాయి. రాత్రిపూట ద్విచక్రవాహనాలపై వెళ్తే కుక్కలు వెంబడిస్తూ ఇబ్బంది పెడుతున్నాయి. కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

–డీఎస్.బాబు, వీఎస్.అగ్రహారం, ఐరాల

కోతుల సమస్య పరిష్కరించండి..



కోతుల ఆగడాలను భరించలేకున్నాం. అందరికీ సమస్యగా మారిన కోతుల బెడదను అధికారులు పరిష్కరించాలి. వీటి సంతతి నానాటికీ పెరిగిపోతూ అందరికీ సమస్యగా మారాయి. పొలాల వద్ద వానరాల కారణంగా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు చర్యలు చేపట్టి కోతుల బెడద తప్పించాలి.

–మునికృష్ణ, రైతు, వీఎస్.అగ్రహారం, ఐరాల

కుక్కకాటుతో ప్రమాదం..



కుక్కకాటుతో రేబిస్ సోకే ప్రమాదం ఉంటుంది. కుక్క కరిస్తే వెంటనే గాయాన్ని 10 నుంచి 15 నిమిషాల పాటు నీటితో శుభ్రం చేయాలి. యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి. రేబిస్ సోకితే తొలిదశలో జ్వరం, తలనొప్పి, వాంతులు వస్తాయి. తర్వాత పిచ్చిగా ప్రవర్తించడం, మనుషులను గుర్తించలేక పోవడం, నోట్లోంచి నురగ, గొంతు పట్టేయడం, ఊపిరి ఆడకపోవడం వంటివి కనిపిస్తాయి. చివరిగా కోమాలోకి వెళ్లి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంటుంది. అందువల్ల జాగ్రత్తగా ఉండాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నాయి.

–ప్రవీణ్‌కుమార్, వైద్యాధికారి, ఐరాల

గ్రామాల్లో 104 వాహన సేవలు

తవణంపల్లె: గ్రామాల్లో పేదలకు నిరంతరం వైద్య సేవలందిస్తున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కేశవ నారాయణ తెలిపారు. శనివారం మండలంలోని ఈచనేరిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేశవ నారాయణ 30 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. వర్షాకాలంలో అంటువ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని, రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

గుడిపాలలో..



గుడిపాల: పెద్దిశెట్టిపల్లెలో వైద్యసేవలు అందిస్తున్న వైద్యసిబ్బంది

గుడిపాల: ప్రతి గ్రామంలో సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నామని డాక్టర్ సంధ్య అన్నారు. శనివారం పెద్దిశెట్టపల్లె గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా మంచం పట్టిన రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం చేయడం జరుగుతుందన్నారు. అనంతరం గర్భిణులు, షుగర్ పేషెంట్‌లకు వైద్య చికిత్సలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 66 మంది రోగులకు చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న తహసీల్దార్ గుర్రప్ప

పూతలపట్టు: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. శనివారం శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆయుర్వేద వైద్య శిబిరానికి 250 మంది రోగులు వచ్చినట్లు ప్రిన్సిపల్ రమేష్‌బాబు తెలిపారు. శిబిరానికి వచ్చిన రోగులకు చికిత్సలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆయుర్వేదం పట్ల అవగాహన కల్పించి, వారికి ఉచితంగా వైద్యం అందించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈ వైద్యశిబిరానికి మండల ఉన్నతాధికారులు, ఉద్యోగులు, యువకులు పాల్గొని ఉచిత వైద్యపరీక్షలు చేసుకున్నట్లు తెలిపారు. ఆర్వీస్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులు పాల్గొని రోగులకు ఉచిత రక్తపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు ప్రిన్సిపల్ రమేష్‌బాబు, వైద్యాధికారులు సురేఖ, రెడ్డెప్ప, ప్రభూత్, మౌనిక, చంద్రశేఖర్, వెంకట్ పాల్గొన్నారు.

ప్రవర్తనలో మార్పు రాకపోతే చర్యలు

- సామాజిక తనిఖీలో బయటపడిన ఫీల్డ్ అసిస్టెంట్ల బాగోతం
- మారకపోతే చర్యలు తప్పవు
- డ్వామా పీడీ రవికుమార్



మాట్లాడుతున్న డ్వామా పీడీ రవికుమార్

పూతలపట్టు: ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రవర్తనలో మార్పు రాకపోతే చర్యలు తప్పవని డ్వామా పీడీ రవికుమార్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అధికారులు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీల వారీగా ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరును తెలియజేయగా వారి భాగోతాలు బయటపడ్డాయి. ఈ సందర్భంగా పీడీ రవికుమార్ మాట్లాడుతూ మండలంలోని చాలా మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఫొటోలు, పాన్ కార్డు, ఆధార్ కార్డు లేకుండా బిల్లులు పెడుతున్నట్లు తెలిపారు. చెక్ మెజర్‌మెంట్, మస్టర్లను పరిశీలించకుండానే వారికి బిల్లులను చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఇంకుడు గుంతలు, పొలాల్లో మొక్కలు నాటకుండానే బిల్లులు పెట్టి నగదు తీసుకున్నట్లు బహిరంగంగా తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు ఇన్ని పనుల చేస్తున్న ఏపీఓ నిర్లక్ష్యం వహిస్తున్నట్లు వాపోయారు. ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పు చేస్తుంటే ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఏపీఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు చేస్తున్న చెత్త పనులకు గ్రామీణ స్థాయిలో ఉపాధిహామీపై ఉన్న నమ్మకం పోతుందని తెలిపారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.18,750 రికవరీ చేశారు. రూ.38 వేలు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసులు, అబ్జర్వర్లు ఎస్‌టీఎమ్ లోకేష్, ఎస్ఆర్డీ మల్లికార్జున, ఎంపీపీ కుమారి, ఎంపీడీఓ నాగరాజు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం కలిగివున్న ఏఆర్.మురుగన్ (44) అనే నిందితుడ్ని శనివారం చిత్తూరు అర్బన్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ శ్రీహరి కథనం మేరకు.. చిత్తూరు మండలంలోని చెర్లోపల్లెలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ మోహనకృష్ణ తన సిబ్బందితో వెళ్లి తనిఖీలు చేశారు. చెర్లోపల్లె కూడలి వద్ద ఓ సంచిలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న మురుగన్‌ను అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 86 కర్ణాటక టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అతడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి, ఆయన ఆదేశాలతో చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మనోహర్

పూతలపట్టు: గ్రంథాలయంలోని పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మనోహర్ తెలిపారు. శనివారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమకారులు ఎస్‌ఆర్ రంగనాథం, పాతూరు నాగభూషణం, అయ్యంకి వెంకట రమణయ్య, మాడపాటి హనుమంతరావు వారి సేవలు వెలకట్టలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన కేంద్రం.. గ్రంథాలయం

ఐరాల: విజ్ఞాన సంపద కేంద్రం గ్రంథాలయం అని, గ్రంథాలయాలను విద్యార్థులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సర్పంచ్ శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాల వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ ఉద్యమకారుల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం గ్రంథాలయ పితామహులైన అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ సుజాత, హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



విద్యార్థికి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రియాంక

పూతలపట్టు: విద్యార్థులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని, తద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ బాలల ఆరోగ్య కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అందజేసిన పుస్తకంలో విద్యార్థి వివరాలు, వారి ఆరోగ్య పరిస్థితులను పొందుపరిచి స్కూల్ హెచ్‌ఎంకు అందజేశారు. నెల రోజుల పాటు ప్రతి పాఠశాలలోని విద్యార్థులను పరీక్షిస్తారని తెలిపారు. ఏటా ఇలా విద్యార్థులను పరీక్షించి, పుస్తకంలో నమోదు చేయడం ద్వారా విద్యార్థి ఆరోగ్య పరిస్థితులల్లో మార్పులు తెలుసుకోవచ్చని తెలిపారు.

యాదమరిలో..

మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆధ్వర్యంలో పిల్లలకు వివిధ రకాల పరీక్షలు చేసి ఆర్‌బీఎస్ పుస్తకంలో వివరాలు నమోదు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నూర్జహాన్, సెల్వరాణి, లక్ష్మీపతి, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వర్షం.. అస్తవ్యస్తం





చిత్తూరు నగరంలోని బజారువీధిలో ముందుకు కదలని మురుగునీరు, (ఇన్‌సెట్) వెంగళరావు నగర్‌లో..

చిత్తూరు అర్బన్: జిల్లాకేంద్రంలో శనివారం కురిసిన ఓ మోస్తరు వర్షానికి ప్రధాన రహదారులతో పాటు చిన్నపాటి కాలనీలు అస్తవ్యస్తం అయ్యాయి. ప్రధాన కాలువల్లో వర్షపు నీళ్లు, మురుగునీరు పొంగిపొర్లడంతో దారులన్నీ మురుగునీటితో నిండిపోయాయి. ఓటీకే రోడ్డు, డీఐ రోడ్డు, ఎంఎస్ఆర్ కూడలి, బజారువీధి, చర్చివీధి ప్రాంతాలు పూర్తిగా నీటితో నిండిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఇక వెంగళరావు కాలనీ, రీడ్స్‌పేట, సీఎంటీ రోడ్డు, గ్లోరీ గార్డెన్, కట్టిలదొడ్డి ప్రాంతం, గిరింపేటలోని పలు కాలనీలు మురుగునీటితో దర్శనమిచ్చాయి. వెంగళరావు కాలనీలో వర్షం పడిన ప్రతిసారి మురుగునీరు ఇళ్లలోకి వచ్చేస్తున్నాయని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.



సీఎంటీ రోడ్డులో పొంగి పొర్లుతున్న డ్రైనేజీ కాలువ



డీఐ రోడ్డులో నిలిచిపోయిన వర్షపునీరు

సమాజంలో పాత్రికేయరంగం విలువైనది



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయ సంఘాల సభ్యులు



తవణంపల్లె తహసీల్దార్‌కు జర్నలిస్టుల వినతి

చిత్తూరు కలెక్టరేట్: ఎంతోకాలంగా పాత్రికేయ రంగానికి సమాజంలో ఎంతో విలువ ఉందని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవాన్ని ఏపీయూడబ్ల్యూజే, చిత్తూరు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చేలా బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం వర్కింగ్ జర్నలిస్టులు మాట్లాడుతూ ఇంటి స్థలాలు, అక్రిడిటేషన్‌లు, జర్నలిస్టులపై దాడుల నివారణకు జిల్లాస్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీ, ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ సీఎంసీ ఆస్పత్రి వర్గాలతో మాట్లాడి ఉచిత వైద్య శిబిరం నిర్వహణకు త్వరలో ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం తపోవనం వద్ద ఉన్న రాస్ వృద్ధాశ్రమంలో వృద్ధులు, బుద్ధిమాంద్యం పిల్లలకు బ్రెడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి అశోక్ కుమార్, చిత్తూరు ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్, కాశేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శివప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు జయకర్, సురేష్, సీనియర్ పాత్రికేయులు బాలసుందరం పాల్గొన్నారు.

సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

తవణంపల్లె: సమాజంలో వాస్తవాలను వెలికి తీసి ప్రజలకు పక్షాన నిలిచే జర్నలిస్టుల పాత్ర కీలమని తహసీల్దార్ సుధాకర్ అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా జిల్లా ఏపీయూడబ్ల్యూజే కార్యనిర్వహక సభ్యుల ఆధ్వర్యంలో తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రెడ్డిబాబుకు వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని, పక్కాగృహాలు మంజూరు చేయాలని, ప్రెస్‌క్లబ్ భవనం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ ప్రెస్‌క్లబ్‌కు స్థలం కేటాయిస్తానని, ఇంటి స్థలాలు కూడా ప్రభుత్వ అనుమతి వచ్చిన తర్వాత చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏపీయూడబ్ల్యూజే కార్యనిర్వాహక సభ్యులు జగన్నాథం, జీవన్ కుమార్ రెడ్డి, రిపోర్టర్లు పాల్గొన్నారు.